# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 158 క్రిష్ణా, బుధవారం 04- 03 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు
మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు
మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో
అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు
క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్

Ph.No: 98497 07349


## మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు! గల్ఫ్ దేశాల అధినేతలకు ప్రధాని ఫోన్




**ఇంటర్నెట్ డెస్క్:** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అరబ్ దేశాల అధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపారు. గల్ఫ్ దేశాలపై దాడులు జరుగుతున్న వైనంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి భారతీయుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. ఒమాన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్, కువైత్ యువరాజు షేఖ్ సబా , ఖతర్ ఎమిర్ షేఖ్ తమీమ్‌లతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారని అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల బహ్రెయిన్, సౌదీ అరేబియా పాలకులతో కూడా ప్రధాని మోదీ మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఈ దాడులు గల్ఫ్ దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ గల్ఫ్ పౌరులకు అండగా ఉంటుందని కూడా హామీ ఇచ్చారు. జోర్డాన్ రాజుతో కూడా మాట్లాడిన ప్రధాని మోదీ సంఘీభావాన్ని ప్రకటించారు. యూఏఈ అధ్యక్షుడు, ఇజ్రాయెలీ ప్రధానితో కూడా మాట్లాడి అక్కడి పరిస్థితి గురించి ఆరా తీశారు.పశ్చిమాసియా, గల్ఫ్ దేశాల్లో సుమారు 90 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఇరాన్‌లో 10 వేల మంది చదువు, ఉద్యోగాల కోసం ఉంటుండగా, ఇజ్రాయెల్‌లో 40 వేల మంది భారతీయులు ఉంటున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా గగనతలం మీదుగా విమానాల రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో, అనేక మంది భారతీయులు దుబాయ్, దోహా సహా పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. ఈ విషయమై ఆదివారం కేబినెట్ కమిటీ కూడా సమావేశమై చర్చించింది.

## డీఏ అరియర్లపై నెలలో ఆదేశాలు: బొప్పరాజు



**క్రైం కౌంటర్ న్యూస్,**విజయవాడ సిటీ, మార్చి 3డీఏ అరియర్స్ బిల్లులను సమర్పించే సమస్యను పరిష్కరించే దిశగా నెల రోజుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2018 జూలై నుంచి డీఏ అరియర్స్‌ను పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించిన విషయం తెలిసిందే. అయితే సాంకేతిక కారణాలు, ట్రెజరీలో రిజెక్ట్ అయినందున కొందరు బిల్లులు సమర్పించలేకపోయారు. బ్యాంకుల విలీనం, ట్రెజరీ ఉద్యోగులు బదిలీ కావడం, బ్యాంకు వివరాలు అప్‌డేట్ కాకపోవడం, ఆధార్ లింక్ చేయకపోవడం తదితర కారణాలతో ప్రభుత్వం ప్రకటించిన డీఏ అరియర్స్ చాలా మందికి అందలేదు. సీఎ?ఫఎంఎ?సలో డీఏ అరియర్స్ బిల్లులను తిరిగి సమర్పించేందుకు వెసులుబాటు కల్పించాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారంపై ఏప్రిల్‌లో స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ కార్యదర్శి అల్లాడ గౌతమ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్



**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాడు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. నియోజకవర్గాల వారీగా జరిగిన నిధుల కేటాయింపులపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు సీఎం పలు విలువైన సూచనలు చేశారని పవన్ తెలిపారు.రాష్ట్రంలోని కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన 'మేజిక్ డ్రెయిన్ల' పనితీరును పవన్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లను నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా అమలు చేయవచ్చని వివరించారు. అలాగే, సాగునీటి పారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేసవిలోనే పూర్తి చేయాలని, దీనివల్ల పంటలు వేసే సమయానికి రైతులకు ఇబ్బందులు ఉండవని కోరారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను కూడా పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా సీఎం సూచనలను పాటిస్తూ ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ.. కీలక అంశాలపై చర్చ



**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. మంగళవారం ఉదయం ఉ ండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ కళ్యాణ్ వెళ్లారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు చంద్రబాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం, డిప్యూటీ సీఎం చర్చించినట్లు తెలిసింది. పవన్ కళ్యాణ్ బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణ మంచినీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించినట్లు తెలిసింది. అలాగే జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపైనా ఇద్దరు నేతలు చర్చించినట్లు సమాచారం. నిధుల వినియోగంతో పాటుగా .. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రహదారుల అభివృద్ధికి కేటాయించిన నిధులు, నియోజకవర్గాల వారీగా కేటాయింపులుపైనా చర్చించినట్లు సమాచారం. అలాగే రాష్ట్రంలోని వివిధ పంచాయతీలలో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనుల గురించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. సీఎం చంద్రబాబుకు వివరించినట్లు తెలిసింది. ఈ తరహా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాలను అన్ని పంచాయతీలలో నిర్మించేలా ఆలోచనలు చేసినట్లు సమాచారం. నీటిపారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీలలో వేసవిలోనే పూడికతీత పనులు చేపట్టాలని.. రైతులు పంట వేసేలోపు ఈ పనులు పూర్తయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఏపీ అటవీ శాఖ హనుమాన్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టు వివరాలను చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్ వివరించారు. ఇక రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో.. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. పలు అంశాలపై మాట్లాడుకోవాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా.. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో పవన్ కళ్యాణ్.. సీఎం చంద్రబాబుతో భేటీ అయినట్లు డిప్యూటీ సీఎంవో వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఏపీలో ఇటీవలి కాలంలో రాజమండ్రి కల్తీపాల ఘటన, శ్రీకాకుళం డయేరియా, వేట్లపాలెం బాణాసంచా పేలుడు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చుట్టూ వివాదం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ కావటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇరాన్ దిగి వచ్చింది.. కానీ ఇప్పటికే ఆలస్యమైంది: ట్రంప్




**వాషింగ్టన్, మార్చి 03:** అమెరికాతో చర్చలకు సిద్ధమంటూ ఇరాన్ దిగి వచ్చింది. అలాంటి వేళ ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశానికి చెందిన మిలటరీ నాయకత్వంతోపాటు రక్షణ రంగానికి చెందిన సామర్థ్యాలను నాశనం చేశామన్నారు. ఇదంతా జరిగిన తర్వాత తమతో చర్చలకు సిద్ధమని ఇరాన్ అంటోందని పేర్కొన్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైందనంటూ ట్రంప్ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.అమెరికా వద్ద ఆధునిక ఆయుధాలు ఉన్నాయని.. అవి కూడా అపరిమితంగా ఉన్నాయని వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రంప్ వెల్లడించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు రీగన్ లాగా.. అధ్యక్షుడు కూడా నేలపై బూట్లు వేయకుండానే ప్రపంచాన్ని మార్చడానికి ఒక మార్గాన్ని కనుగొన్నారంటూ వైట్ హౌస్ మాజీ స్పీచ్ రైటింగ్ డైరెక్టర్ మార్క్ థిస్సెన్ రాసిన కాలమ్‌కు ప్రతిస్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే ఎప్పటికీ విజయవంతంగా యుద్ధం చేస్తూనే ఉ ండగలమన్నారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో సైతం నిల్వ చేసినట్లు ట్రంప్ వివరించారు. ఇక యూఎస్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు చేశారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగ్గా నిర్వహించలేదంటూ మండిపడ్డారు. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు భారీ ఎత్తున ఆయుధాలు పంపారని ఆరోపించారు. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు అందుకునే అంతగా ఉన్నాయని ట్రంప్ ఈ సందర్భంగా వివరించారు.

## నెయ్యి టెండర్ల ప్రక్రియపై అధ్యయనం ప్రారంభం

**క్రైం కౌంటర్ న్యూస్,** తిరుపతి(టీటీడీ), మార్చి 3 శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి సరఫరాకు బాధ్యులను గుర్తించేందుకు ఏకసభ్య కమిషన్ అధ్యయనం ప్రారంభమైంది. కమిషన్ సారథి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ మంగళవారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుపతిలోని శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకొని నెయ్యి సేకరణకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్నంగా పరిశీలించారు. న్యాయస్థానంలో సిట్ ఇప్పటికే దాఖలు చేసిన చార్జిషీట్‌లోని అంశాలను అధ్యయనం చేశారు. టెండర్ల నుంచి స్వామివారి ప్రసాదాలకు నెయ్యి వినియోగించడం వరకూ మొత్తం ప్రక్రియను ఆయన పూర్తిస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రసాదాల వినియోగానికి రోజుకు ఎంత నెయ్యి వినియోగిస్తారు, ఎంత నిల్వ ఉంచాతారు, టెండర్లు ఎప్పుడు పిలుస్తారనే విషయాలతో పాటు టెండర్లు పిలిచిన తర్వాత జరిగే ప్రక్రియను అధ్యయనం చేశారు. అలాగే నెయ్యి సరఫరా కోసం నిర్దేశించిన ప్రమాణాలను పరిశీలించారు. వివిధ సంస్థలు టెండర్లు దాఖలు చేసిన తర్వాత ఏ విధంగా సరఫరాదారులను ఖరారు చేస్తారు? సాంకేతిక కమిటీ, ఎక్స్‌పర్ట్ కమిటీలు, కొనుగోలు కమిటీ(బోర్డు సభ్యులతో)ల పాత్రల గురించి అధ్యయనం చేశారు. టెండరు ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నోట్ తయారు చేసుకుంటున్నారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో ఐదేళ్ల కాలంలో టీటీడీ అధికారులు ఎన్నిసార్లు టెండరు పిలిచారు, ఎప్పుడెప్పుడు నెయ్యి కొనుగోలు ప్రమాణాల్లో మార్పులు తీసుకువచ్చారనే అంశాలను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా 45 రోజుల్లోనే ప్రక్రియను ముగించాల్సి ఉన్న నేపథ్యంలో దినేశ్ కుమార్ దస్త్రాల పరిశీలనను ప్రారంభించారు.

# మద్యంలో డిజిటల్ చెల్లింపులు

**30 నుంచి 60శాతం పెంపే లక్ష్యం.. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక పాలసీ.. షాపులు, బార్లలో అమలు తప్పనిసరి**
**ఎక్సైజ్ డేటాబేస్‌కు చెల్లింపుల డేటా**
**సీసాలు స్కానింగ్ చేసి అమ్మాల్సిందే**
**మంత్రివర్గం ఆమోదంతో అమలు**
**పారదర్శకతకు పెద్దపీటే లక్ష్యం**




**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** మద్యం అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక పాలసీ తీసుకురానుంది. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నా ఈ విధానాన్ని శాశ్వత ప్రాతిపదికన అమలు చేసేందుకు 'లిక్కర్ డిజిటల్ చెల్లింపులు' పేరుతో ఈ పాలసీని అమలు చేయనుంది. ఈ పాలసీకి సంబంధించిన ఫైలు వచ్చే మంత్రి వర్గ సమావేశం ముందుకురానుంది. మంత్రివర్గ ఆమోదం లభించగానే డిజిటల్ చెల్లింపుల విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుంది. నెల రోజుల వ్యవధిలో ఈ పాలసీ అమల్లోకి వస్తుందని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. పాలసీ అమల్లోకి వచ్చాక ప్రతి బార్, మద్యం షాపులో కచ్చితంగా డిజిటల్ చెల్లింపుల సౌకర్యం అందుబాటులో ఉండనుంది. ఈ విధానం ప్రకారం.. మద్య కొనుగోలుదారులు డిజిటల్ విధానంలో బిల్లు చెల్లిస్తానంటే లైసెన్సీలు తిరస్కరించకూడదు. దీనికిగాను ఎక్సైజ్ శాఖ షాపులు, బార్లకు డిజిటల్ చెల్లింపులకు అవసరమైన ఉపకరణాలను అందించనుంది.

ప్రస్తుత విధానంలో..

గత కొంతకాలం నుంచి రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపుల విధానం అమలవుతోంది. డిజిటల్ చెల్లింపుల సౌకర్యం ఉండాలనే నిబంధనను మద్యం షాపులు, బార్ పాలసీల్లో ఎక్సైజ్ శాఖ పేర్కొంటోంది. ప్రతిసారీ పాలసీలో ఈ నిబంధన తప్పనిసరిగా పెట్టాల్సి వస్తోంది. అయితే, ఈ నిబంధనను షాపులు, బార్ల లైసెన్సీలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిసారీ మద్యం పాలసీల్లో ఈ నిబంధన పెట్టాల్సిన అవసరం లేకుండా డిజిటల్ చెల్లింపులను శాశ్వతంగా అమలుచేయడం కోసం ఈ పాలసీని ఎక్సైజ్ శాఖ తీసుకురానుంది. ప్రస్తుత విధానంలో డిజిటల్ చెల్లింపులు చేసినా ఆ విషయం సంబంధిత లైసెన్సీకి మాత్రమే తెలుస్తుంది. ప్రస్తుతం సుమారు 30శాతం మేర డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నా ఆ సమాచారం ఎక్సైజ్‌కు చేరడంలేదు. నూతన పాలసీ అమల్లోకి వచ్చాక ఎవరు డిజిటల్ చెల్లింపులు చేశారనే సమాచారం రియల్‌టైమ్‌లో ఎక్సైజ్ డేటాబేస్‌లో నిక్షిప్తం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు

డిజిటల్ చెల్లింపులతో పాటు ఎక్సైజ్ శాఖ కొత్తగా 'ట్రాక్ అండ్ ట్రేస్' విధానాన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం మద్యాన్ని ఉత్పత్తి చేసే డిస్టిలరీల నుంచి నిల్వ చేసే డిపోల వరకు మాత్రమే తెలుసుకునే(ట్రాకింగ్) వ్యవస్థ ఉంది. మద్యం డిపోల నుంచి బార్లు, షాపులు మద్యం కొనుగోలు చేస్తాయి. ఆ తర్వాత వారు ఏ రోజు ఏ సమయంలో ఎంత మద్యం విక్రయించారో ప్రభుత్వానికి తెలియడం లేదు. దీంతో షాపులు, బార్లలో ఎంత మద్యం స్టాకు ఉందనే వివరాలు సంబంధిత లైసెన్సీలకు తప్ప ఎవరికీ తెలియదు. కొత్త ట్రాకింగ్ విధానంలో ప్రతి షాపు, బారుకు స్కానర్ ఇస్తారు. కచ్చితంగా స్కాన్ చేసిన తర్వాత మాత్రమే సీసాలను వినియోగదారులకు విక్రయించాలి. స్కాన్ చేసిన వెంటనే ఆ సమాచారం ఎక్సైజ్ డేటాబేస్‌కు చేరుతుంది. ఆ తర్వాత వినియోగదారుడు డిజిటల్ పేమెంట్ చేస్తే ఆ సమాచారం కూడా ప్రభుత్వానికి తెలుస్తుంది. నగదు చెల్లింపు చేస్తే మాత్రం వెంటనే ఎక్సైజ్‌కు సమాచారం అందదు. డిజిటల్ చెల్లింపుల పాలసీలో భాగంగా షాపులు, బార్లలో అన్ని రకాల డిజిటల్ సౌకర్యాలు అందుబాటులో ఉంచుతారు. కార్డుల స్వైపింగ్, ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర డిజిటల్ చెల్లింపుల సౌకర్యం ఏర్పాటు చేస్తారు. అలాగే వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న 30శాతం చెల్లింపులను కనీసం 60 శాతం చేయాలనే లక్ష్యంగా పాలసీని రూపొందిస్తున్నారు.

పారదర్శకత పెంపే లక్ష్యం

వైసీపీ ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో చెల్లింపుల విధానంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నగదును పక్కదారి పట్టించడం కోసమే డిజిటల్ చెల్లింపులు లేకుండా చేశారని అప్పట్లో రాజకీయ పార్టీలు ఆరోపించాయి. ప్రభుత్వ పర్యవేక్షణలో సాగిన మద్యం షాపుల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వ లెక్కల్లోకి రాకుండా మద్యాన్ని విక్రయించి ఆ నగదు జేబుల్లో వేసుకున్నారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులను శాశ్వతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా మద్యం విక్రయాలు, ఆదాయంలో పాదర్శకతను పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

# గ్రామాల్లో ప్రత్యేక పాలన!

**మండలాధికారులకు పగ్గాలు**
**ఏప్రిల్ 2తో ముగియనున్న పంచాయతీల పదవీకాలం**
**జూన్ తర్వాతే ఎన్నికలకు చాన్స్**
**డెడికేటెడ్ కమిషన్ నివేదిక వచ్చాకే బీసీలకు 34శాతం రిజర్వేషన్ అమలు**
**గ్రామాల్లో అభివృద్ధి పూర్తికి సమయం**
**సాహ్నీ స్థానంలో నీరబ్‌కు అవకాశం**
**ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్లేలా నిర్ణయం**
**తొలుత పరిషత్.. తర్వాత పంచాయతీ?**




అమరావతి– ఏప్రిల్ 2 నాటికి గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియనుంది. దీంతో కొంతకాలం గ్రామీణ పాలనను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎన్నికలు జరిగే వరకు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక పాలనాధికారులుగా ఆయా మండలాల అధికారులను నియమించనున్నారు. మరోవైపు, ఈ నెలాఖరుతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ పదవీకాలం ముగియనుంది. ఆమె స్థానంలో రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను నియమించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. 45 రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని కమిషన్‌కు సూచించింది. ఈ నివేదిక వచ్చాక బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ నివేదిక వచ్చేందుకు కనీసం రెండు నెలలు పడుతుంది. మరోవైపు, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు కనీసం ఒక నెల గడువు అవసరం. ఈ నేపథ్యంలో జూన్ తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు.

ముందు ఏ ఎన్నికలు?

ఏప్రిల్ 2 నాటికి గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియనుండటంతో ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆలస్యమైనా.. బీసీ రిజర్వేషన్ల వ్యవహారం కోర్టుకు ఎక్కినా.. పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కానున్నాయి. మరోవైపు, సెప్టెంబరులో మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగియనుంది. దీంతో ఏ ఎన్నికలు ముందు నిర్వహించాలనే విషయం సమస్యగా మారే అవకాశముంది. ఈ క్రమంలో తొలుత పరిషత్, తర్వాత గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తే.. కూటమి పార్టీలకు ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీలకు సంబంధం లేకుండా జరుగుతాయి. ఈ సమయంలో సహజంగా గ్రామాల్లో గ్రూపులు ఏర్పడతాయి. ఈ గ్రూపుల ప్రభావం మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కనిపిస్తుంది. అలాకాకుండా.. ముందుగా పార్టీ గుర్తులతో నిర్వహించే పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తే.. కూటమి నేతలు పూర్తిస్థాయిలో పదవులు కైవసం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అనంతరం.. సర్పంచ్ ఎన్నికలు చేపడితే కూటమి పార్టీలకు అనుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు. దీంతో పరిషత్ ఎన్నికల తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలనే వాదన వినిపిస్తోంది.

అభివృద్ధి నినాదం!

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక అవగాహనతో ఉన్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. సంస్కరణలకు పెద్దపీట వేశారు. ఈ క్రమంలో ఇప్పటికే 8 వేల కిలో మీటర్ల మేర సిమెంట్‌రోడ్లతో పాటు 34 వేల మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టారు. 'పల్లెపండుగ 2.0' ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇలా పంచాయతీల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారు. వీటిని ప్రజలకు వివరించి ఎన్నికలకు వెళ్తే ప్రభుత్వాన్ని తప్పకుండా ఆదరిస్తారని వారు భావిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లపై..

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం గతంలోనే హామీ ఇచ్చింది. అయితే, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టు సూచించిన 'ట్రిపుల్ టెస్ట్'ను అనుసరించకుండా ఎన్నికలకు వెళ్లడంతో న్యాయస్థానం ఎన్నికలను నిలిపివేసింది. ట్రిపుల్ టెస్ట్ ప్రకారం డెడికేటెడ్ కమిషన్ వేసి ఏయే ప్రాంతాల్లో బీసీలకు ఏ మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలో జనాభా ప్రాతిపదికన అధ్యయనం చేయాలి. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదు. అయితే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం కోటా కల్పించాలని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ రెండు కేటగిరీలకు పోను మిగిలిన 29 శాతం మాత్రమే బీసీలు, మైనారిటీలకు అమలు చేయాలి. దీనిలో మైనారిటీలకు 4 శాతం అమలు చేస్తే బీసీలకు ఇక 25 శాతం మాత్రమే అమలు చేసే అవకాశం ఉంటుంది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోతే ఎన్నికలు నిలిచిపోతాయి. ఇక, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఇబ్బందేనని కూటమి నేతలు భావిస్తున్నారు. ఏదేమైనా తెలంగాణ మాదిరిగానే ఏపీలోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని, ఆ తర్వాత న్యాయపరమైన వివాదాలు ఏర్పడితే ప్రజలు అర్థం చేసుకుంటారని.. నేతలు అంచనా వేస్తున్నారు. ఇదే పంథాలో ముందుకెళ్లినా జూన్ తర్వాతే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

# కస్సుబుస్సు కార్తికేయ! తీరు మార్చుకోని సీఎం కార్యదర్శి మిశ్రా

**ఈసారి కృష్ణా కలెక్టర్, ఎస్పీలపైనే చిందులు**
**తమాషాగా ఉందా, సరిగ్గా నిలబడు అంటూ వీరంగం**
**అందరూ చూస్తుండగానే అనుచిత ప్రవర్తన**
**కలెక్టర్‌కు కొరియర్‌లో షూస్ పంపి అవమానం**
**మిశ్రా తీరుపై అధికార యంత్రాంగం గరంగరం**
**ఆది నుంచీ ఆయనది వివాదాస్పద ప్రవర్తనే**
**కిందిస్థాయి సిబ్బంది, మరీ ముఖ్యంగా తెలుగు అధికారులపై చిన్నచూపు**



**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి... మరో ఐఏఎస్ అధికారిని, ఐపీఎస్‌ను అన్న మాటలివి! ఇతర అధికారులంతా చూస్తుండగా... ఒక జిల్లా కలెక్టర్, ఎస్పీలపై ఆయన కస్సుబుస్సులాడారు. అంతేకాదు... 'ఎలాంటి బూట్లు వేసుకోవాలో తెలియదు' అని చిన్నబుచ్చడంతోపాటు కలెక్టర్‌కు కొరియర్‌లో షూస్ పంపి మళ్లీ అవమానించారు. ఇంతగా చెలరేగిపోయిన ఆ ఐఏఎస్ అధికారి పేరు... కార్తికేయ మిశ్రా! ఆయన ముఖ్యమంత్రి కార్యదర్శి! ఇప్పుడే కాదు... సర్వీసులో చేరినప్పటి నుంచీ కార్తికేయ మిశ్రాది అదే తీరు! కిందిస్థాయి సిబ్బందిని నోటికొచ్చినట్లు దూషిస్తారనే పేరు! ఇటీవల నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితోనూ లడాయి పెట్టుకున్నారు. ఇప్పుడు ఏకంగా అఖిల భారత సర్వీసు అధికారులపైనే నోరుపారేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం అసలేం జరిగిందంటే...సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర పర్యటన ముగిసిన ఆదివారం ఆయనకు ప్రభుత్వ యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. సీజేఐ వెళ్లిపోయిన తర్వాత అధికారులంతా గన్నవరం ఎయిర్‌పోర్టు లాంజ్‌లో ఉండగా అక్కడికి సీఎం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ కార్తికేయ మిశ్రా వచ్చారు. కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీని పిలిచి... 'ఆ టై కట్టుకోవడమేమిటి? కోటు అలాగేనా వేసుకునేది? సరైన షూ ఎందుకు వేసుకోలేదు' అంటూ పెద్ద గొంతుతో అరవడం మొదలుపెట్టారు. లేస్ ఉన్న షూస్ వేసుకోలేదంటూ మండిపడ్డారు. అనూహ్య ఘటనతో బాలాజీ ఒక్కసారిగా విస్తుపోయారు. 'అదేం లేదు సార్, ఓకే సార్' అంటూ నవ్వుతూ సర్దుకుపోయే ప్రయత్నం చేశారు. 'ఏం నవ్వుతున్నావ్? తమాషాగా ఉందా?' అంటూ మరింతగా మిశ్రా రెచ్చిపోయారు. ఆగకుండా ఐదారు నిమిషాల పాటు అందరూ వినేలా నోటికి పని చెప్పారు. అంతటితో శాంతించకుండా పక్కనే ఉన్న కృష్ణా ఎస్పీ విద్యాసాగర్ నాయుడిని కూడా పిలిచారు. ఆయన తన దగ్గరికి వచ్చాక... 'సీదా ఖడో' (సరిగ్గా నిల్చో) అంటూ హుకుం జారీ చేశారు. 'సర్, నేను సరిగ్గానే ఉన్నాను' అని అంటుండగా 'ఏమిటి నోరు లేస్తోంది? తమాషాలు చేయకు' అంటూ హిందీలో కస్సుమన్నారు. కార్తికేయ మిశ్రా వీరంగం చూస్తున్న ఇతర అధికారులంతా బిత్తరపోయి నిల్చున్నారు.

తనకు సంబంధం లేకున్నా...

భారత ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం, వీడ్కోలు పలకడానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ విధిగా రావాలి. ఇది ప్రొటోకాల్! అలాగే కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఒకవేళ వారు ప్రొటోకాల్ ప్రకారం వ్యవహరించక పోయి ఉంటే... సంబంధిత అధికారులే స్పందించాలి. సీఎం కార్యదర్శిగా ఉన్న కార్తికేయ మిశ్రాకు దీంతో ఎలాంటి సంబంధంలేదు. అయినప్పటికీ... ఆయన అతిగా స్పందించడం గమనార్హం.

ఆది నుంచీ ఇదే తంతు

కార్తికేయ మిశ్రా వ్యవహార శైలి ఆది నుంచీ వివాదాస్పదమే. కొందిస్థాయి సిబ్బందిపై లెక్కలేకుండా మాట్లాడతారని, తెలుగు అధికారులంటే మరింత చిన్నచూపని, 'మీకు ఇంగ్లిషు రాదు. ఏమీ తెలియదు' అని చులకనగా చూస్తారని ఆయనపై ఆరోపణలున్నాయి. మిశ్రా వ్యవహార శైలిపై ఇప్పటికే ముఖ్యమంత్రికి ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా ఉండగా టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన ఒక తహసీల్దార్‌ను 'ఏంట్రా నీ పేరు? యూజ్‌లెస్ ఫెలో, బ్లడీ జోకర్' అని తిట్టిపోశారు. ఈ విషయం రచ్చకెక్కడంతో నాటి ప్రభుత్వం ఆయనను కలెక్టర్‌గా తప్పించి కార్మికశాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. అక్కడి నుంచి ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. తర్వాత మళ్లీ రాష్ట్రానికి వచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు నంద్యాల ఎంపీ శబరితోనూ గొడవ పెట్టుకున్నారు. సీఎంతో మాట్లాడేందుకు ప్రయత్నించిన శబరిని అడ్డుకుని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం చినికిచినికి గాలివానగా మారి సీఎం దాకా వెళ్లింది. ఆ తర్వాతైనా మిశ్రా మారతారనుకుంటే... తాజాగా తోటి అఖిల భారత సర్వీసు అధికారులపైనే విరుచుకుపడుతూ, 'నేనింతే' అని నిరూపించుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొరియర్‌లో షూ పంపి... కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదివారం దాదాపు రోజంతా భారత ప్రధాన న్యాయమూర్తితో ఉన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ఎక్కడైనా షూ విప్పి, మళ్లీ వేసుకోవాల్సి వస్తే... ఆలస్యం కాకుండా ఉండేందుకు లేస్ ఉన్నవి కాకుండా, మామూలు బూట్లు వేసుకున్నారు. కార్తికేయ మిశ్రా ఆగ్రహానికి అదే కారణమైంది. ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో కస్సుబుస్సుమన్న ఆయన అంతటితో ఊరుకోకుండా... కలెక్టర్‌కు కొరియర్‌లో లేస్ ఉన్న బూట్లు పంపినట్లు తెలిసింది. ఇది దురహంకారపూరితమని, సాటి ఐఏఎ?సను అవమానించడమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# అర్ధరాత్రి అంగన్వాడీల అరెస్ట్!



**క్రైం కౌంటర్ న్యూస్,** విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 3 సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు సోమవారం 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చారు. చర్చలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ధర్నా అనంతరం సోమవారం రాత్రి ధర్నాచౌక్ శిబిరంలో నిద్రకు ఉపక్రమించారు. నిద్రపోతున్న అంగన్వాడీలను పోలీసులు అర్ధరాత్రి (మంగళవారం తెల్లవారుజామున) అరెస్టు చేశారు. బస్సుల్లో ఏలూరు, సత్తెనపల్లి, నరసరావుపేట పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు అంగన్వాడీలు గాయపడ్డారు. అరెస్ట్ చేసే క్రమంలో పురుష పోలీసులు తమపట్ల అమానుషంగా వ్యవహరించారని పలువురు మహిళలు మండిపడ్డారు. మహిళలని చూడకుండా తాళ్లు వేసి, ముసుగులు కప్పి బలవంతంగా వాహనాల్లో కుక్కారని ఆరోపించారు. అంగన్వాడీ రాష్ట్ర నాయకులు బి. బేబీరాణి, కె.సుబ్బరావమ్మ తదితరులను అరెస్ట్ చేశారు. కాగా, అంగన్వాడీలు నిద్రమత్తులో ఉండగానే తెల్లవారుజామున పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎ?ఫటీయూ అనుబంధ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మండిపడ్డారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె. ధనలక్ష్మి మాట్లాడుతూ అరెస్టు చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరికొన్ని రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం మహిళల గురించి గొప్పగా చెబుతూ మరోపక్క అంగన్వాడీలపై అమానుష దాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని ఆరోపించారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘం ప్రధాన కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి అక్రమ అరెస్టులకు పాల్పడటం అన్యాయమని అన్నారు. ఐఎ?ఫటీయూ అనుబంధ సంఘం రాష్ట్ర నాయకురాలు సుజాత మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మూడు సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

# ప్రజల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం: పవన్

**భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం**
**వాటితో కలిసి జీవిద్దాం.. కలివిడిగా బతుకుదాం**
**మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నివారణకు చర్యలు**
**జంతువులతో పాటు పంటలు, ప్రజల ప్రాణాలు, ఆస్తులను సంరక్షించడమే ప్రధాన కర్తవ్యం: పవన్**
**హనుమాన్ యాప్, 7 వైల్డ్‌లైఫ్ అంబులెన్సులు, 93 ఆర్ఆర్ఆర్ వాహనాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం**



**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** అమరావతి/మంగళగిరి సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): "ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉంది. మనం నమ్మే వసుధైక కుటుంబ సిద్ధాంతాన్ని 'హనుమాన్' ఫౌండేషన్ మరింత బలంగా ముందుకు తీసుకెళ్తుంది. రాష్ట్రంలో మానవ-వన్యప్రాణి సహజీవనానికి మార్గదర్శకంగా హనుమాన్ ప్రాజెక్ట్ నిలుస్తుంది" అని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ మనందరి బాధ్యత అని, వన్యప్రాణులతో కలిసి జీవిద్దాం.. కలిసి బతుకుదాం అని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో వన్యప్రాణుల వలన పంట, పశు సంపదకు నష్టంతోపాటు మానవ భద్రతకు ముప్పు కలిగించే ఘటనలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం హనుమాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మంగళవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన హీలింగ్ అండ్ నర్చరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ (హనుమాన్) ప్రాజెక్ట్ రాష్ట్రవ్యాప్త పూర్తిస్థాయి అమలును పవన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హనుమాన్ యాప్, 7 వైల్డ్‌లైఫ్ అంబులెన్సులు, 93 ఆర్ఆర్ఆర్ వాహనాలను కూడా ప్రారంభించారు. అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అటవీ అధికారులు, ఎన్జీవోలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ ఏమన్నారంటే.

'సంఘర్షణ నుంచి సహజీవనం' వైపు..

"హనుమాన్ ఫౌండేషన్ అనేది మానవ, వన్యప్రాణుల సంఘర్షణల నివారణకు ఏర్పాటు చేసిన సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమం. ముఖ్యంగా చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగులు, ఇతర వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చి పంట నష్టాలతో పాటు ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్నందున.. వీటిని ఎలా నివారించాలన్న ఆలోచన నుంచి పుట్టిందే హనుమాన్ ప్రాజెక్ట్. రాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ, వారి జీవనోపాధికి భద్రత కల్పించడం, వన్యప్రాణి సంరక్షణ చర్యలు మరింత కట్టుదిట్టంగా ముందుకు తీసుకెళ్లడం దీని లక్ష్యం. అటు వన్యప్రాణులను సంరక్షిస్తూనే.. పంటలు, పశువులు, ప్రజల ప్రాణాలు, ఆస్తులను సంరక్షించడమే ప్రధాన కర్తవ్యం. ఏఐ సహకారంతో వన్యప్రాణుల కదలికలను గమనించేలా టెక్నాలజీని వినియోగిస్తున్నాం. ఏదైనా సంఘర్షణ చోటు చేసుకున్నప్పుడు వెంటనే స్పందించడం, ఉపశమన చర్యలు, పరిహారం చెల్లింపు వ్యవస్థల్ని ఫౌండేషన్ నిర్వహిస్తుంది. 'సంఘర్షణ నుంచి సహజీవనం' వైపు మళ్లించడమే ప్రధాన ఉద్దేశం" అని పేర్కొన్నారు.

గ్రామస్థాయిలో వజ్ర బృందాల సన్నద్ధం

"ఈ ప్రాజెక్ట్ కోసం మొదటిసారిగా రాష్ట్రంలో జీపీఎస్ ట్రాకింగ్ వంటి సదుపాయాలతో కూడిన 100 వాహనాలను అందుబాటులోకి తెచ్చాం. ఇందులో 93 ర్యాపిడ్ రెస్పాన్స్, రెస్క్యూ(ఆర్ఆర్ఆర్) టీమ్ వాహనాలు, 7 వైల్డ్‌లైఫ్ అంబులెన్స్‌లు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైరుట్లలో 4 వైల్డ్‌లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మ రో 19 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రతి వాహనంలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్య సిబ్బంది, గిరిజన సహాయకులు, పారా వెటర్నేరియన్స్, ట్రైన్డ్ అండ్ కమ్యూనిటీ బేస్డ్ వెటర్నేరియన్స్, కమ్యూనిటీ బేస్డ్ యానిమల్ వర్కర్ల తో కూడిన పూర్తి స్థాయి వ్యవస్థ ఉంటుంది. గ్రామ స్థాయిలో 'వన్యజీవ రక్షక్(వజ్ర)'లను నియమిస్తున్నాం. వీరికి రెస్క్యూ కిట్స్ అందిస్తున్నాం. పాములు, జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించేలా బృందాలకు శిక్షణ ఇస్తున్నాం" అన్నారు.

బాధితులకు పరిహారం రెట్టింపు

"కూటమి ప్రభుత్వం వచ్చాక మానవ-జంతు సంరక్షణల్లో జరిగిన నష్టానికి ఎప్పటికప్పుడు పరిహా రం చెల్లిస్తున్నాం. 2025-26లో ఇప్పటికి 2,107 కేసులు నమోదు కాగా, రూ.4 కోట్ల మేర పరిహారం చెల్లించాం. కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పంట నష్టపరిహారాన్ని గణనీయంగా పెంచాం. జంతు దాడు ల్లో చనిపోయే వారి కుటుంబాలకు పరిహారాన్ని రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గాయపడిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలకు పెంచాం. చిత్తూరు, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో తీవ్రంగా ఉన్న ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వం సహకారంతో 4 కుంకీ ఏనుగులను తీసుకొచ్చి, ఇప్ప టి వరకు 8 ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించాం. ఏఐ ఆధారిత పైలట్ ప్రాజెక్ట్ ద్వారా ముందస్తు హెచ్చరికలు ఇచ్చే వ్యవస్థను అటవీ శాఖ సరిహద్దు గ్రామాల్లో అమలు చేస్తోంది." అని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు.

ప్రజలు, స్వచ్ఛంద సంస్థలూ భాగస్వామ్యమవ్వాలి

తొలుత పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. అటవీశాఖలో ఎన్నో సంస్కరణలకు ప్రభుత్వం నాంది పలికిందన్నా రు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణలను తగ్గించేలా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా పవన్ కల్యాణ్ ఎంతో చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా హనుమాన్ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడు తూ.. జంతువుల వల్ల ప్రాణ నష్టం జరిగినప్పు డు 24 గంటల్లోనే బాధితులకు పరిహారం అందే లా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గజప్రజ, సర్పమిత్ర వంటి కార్యక్రమాల ద్వారా వన్యప్రాణులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏవైనా వన్యప్రాణులు ప్రజాబాహుళ్యంలో ఇబ్బంది కలిగించకుండా ఏఐ సాయంతో వాటిని తిరిగి అడవుల్లోకి పంపే చర్యలు హనుమాన్ ప్రాజెక్ట్‌తో జరుగుతాయని చెప్పారు. పవన్‌కు జంట ఏనుగుల ప్రతిమను బహుకరించారు.

# చెరువులపై ఇంత నిర్లక్ష్యమా?

వాటి మరమ్మతులకు 372 కోట్లు అవసరం
బడ్జెట్‌లో కేటాయింపులు 72 కోట్లే
పొరుగు రాష్ట్రాల్లో ఇబ్బడి ముబ్బడిగా చెక్‌డ్యాముల నిర్మాణం
గొలుసుకట్టు చెరువులకూ ప్రాధాన్యం
ఇక్కడ మాత్రం అరకొర నిధులు



**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, మార్చి 3 రాష్ట్రంలో కరువును దూరం చూసే చెరువుల మరమ్మతు, నిర్వహణకు ప్రాధాన్యం లభించడం లేదని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు మహారాష్ట్రల్లో చిన్నతరహా సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తుంటే.. ఇక్కడ మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని అంటున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకం కింద చెరువుల పూడికతీత, నీటి కుంటల తవ్వకం, ఇంకుడు గంతల తవ్వకం పనులు చేపట్టారు. వీటికి నిధులివ్వకుండా జగన్ ప్రభుత్వం తొక్కిపెట్టింది. హైకోర్టు ఆదేశాలిచ్చినా చెల్లింపులు జరుపలేదు. పైగా 356 మంది జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దీంతో రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ విభాగంలో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. చెరువులు, నీటి కుంటలు, వాటర్‌షెడ్ పథకాలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే నిర్లక్ష్యం ఇప్పటికీ కొనసాగుతోందని నిపుణులు విమర్శిస్తున్నారు. జలవనరుల వాఖలో 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 3,486.. పంచాయతీరాజ్ శాఖలో 100 ఎకరాలు ఆయకట్టు ఉన్న చెరువుల సంఖ్య 35,376 ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ కింద 25.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే చెరువులు 38,862 ఉన్నాయి. వీటన్నిటికీ మరమ్మతులు చేయాల్సిన అవసరముంది. ఇందుకు రూ.372 కోట్లు అవసరం కాగా.. తాజా బడ్జెట్‌లో 72 కోట్లు మాత్రమే కేటాయించడంపై నిపుణులు ఆక్షేపిస్తున్నారు. కాలువల పూడికతీత, చెరువుల పూడికతీత, చెక్‌డ్యాముల వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కేంద్రం పీఎం కిసాన్ యోజన కింద చెరువుల అభివృద్ధికి నిధులు ఇస్తోంది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుంది. ఈ ఏడాది రూ.299 కోట్లు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. వీటిని సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే నీటి వినియోగదారుల సంఘాల ద్వారా రూ.10 లక్షల దారా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినందున.. చెరువులు, చెక్‌డ్యాములకు వీటిని వాడుకోవాలని కోరుతున్నారు.

# రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం




**క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 03:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 అంబులెన్సులు ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవనిగా నిలుస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో దాదాపు 10 లక్షల మందికిపైగా బాధితులు 108 అంబులెన్సు సేవలు పొందితే... అందులో 7.50 లక్షల మంది మాత్రమే ఈ వాహనాల ద్వారా ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకున్నారు. మిగిలిన 2.50 లక్షల మందికి టెలీమెడిసిన్ ద్వారా అక్కడికక్కడే వైద్యం అందించి ఇంటికి పంపించేసిన ఈ అంబులెన్సులు "మినీ ఆస్పత్రి" పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రం మొత్తం 1.75 లక్షల కిలోమీటర్ల మేర రోడ్డు కనెక్టివిటీ ఉంటే.. కూటమి ప్రభుత్వంలో అంబులెన్సులు 1.15లక్షల కి.మీ. అంటే దాదాపు 60 శాతం కనెక్టివిటీని కవర్ చేశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరబిందో నిర్వహణలో ఉన్న 108 అంబులెన్సులు 40శాతం రోడ్డు కనెక్టివిటీని మాత్రమే కవర్ చేశాయి. మొత్తంగా గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా ఉన్న 108 అంబులెన్సుల నిర్వహణను కూటమి ప్రభుత్వం మెరుగుపరిచి ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలందేలా చూస్తోంది. టెక్నాలజీ సాయంతో ప్రతి పల్లెకూ సేవలు విస్తరిస్తూ ప్రజారోగ్య పరిక్షణకు పెద్దపీట వేస్తోంది.అంబులెన్సుల్లో టెలీమెడిసిన్...

కూటమి ప్రభుత్వం 108 అంబులెన్సుల్లో ప్రత్యేకంగా టెలీమెడిసిన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఈఆర్సీ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్) నుంచి ఈ సేవలందిస్తోంది. అంబులెన్సుల్లో ప్రత్యేకంగా ఎండీటీ (మొబైల్ డేటా టెర్మినల్), సీసీ కెమెరాలతో పాటు స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ఈఆర్సీలో ప్రత్యేకంగా 18 మంది వైద్యులను నియమించారు. అంబులెన్సులు ప్రమాదస్థలం లేదా బాధితులున్న ప్రదేశానికి వెళ్లిన వెంటనే ఈఆర్సీలో ఉన్న వైద్యులు అంబులెన్సుల్లో ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)తో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారి పల్స్, ఆక్సిజన్ లెవల్స్, బీపీ ఎలా ఉన్నాయో తెలుసుకుంటారు. బాధితుడి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటే వీడియో కాల్ ద్వారా లైవ్‌లోకి వచ్చి బాధితులకు ఎలాంటి వైద్యం అందించాలి, ఏఏ ముందులు ఇవ్వాలో సూచిస్తారు. వారి సూచన మేరకు ఈఎంటీ బాధితులకు ప్రాథమిక చికిత్స అందిస్తారు. అలాగే గుండెపోటు, రోడ్డు ప్రమాద బాధితులకు కూడా రన్నింగ్‌లో ఉండగానే టెలీమెడిసిన్ ద్వారా ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఈ విధానం ద్వారా దాదాపు 20 శాతం మంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కూటమి ప్రభుత్వంలో 108 అంబులెన్సుల్లో ఎండీటీ (మొబైల్ డేటా టెర్మినల్) పరికరాన్ని అమర్చారు. ఈ పరికరం ఇటు ఈఆర్సీ సిబ్బందితో పాటు 108 అంబులెన్సు డ్రైవర్, ఈఎంటీని అలెర్ట్ చేస్తుంది. ఏదైనా ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు.. అక్కడ నుంచి ఎవరైనా 108కు ఫోన్ చేసినప్పుడు ఈఆర్సీకి సిబ్బంది కాల్ రీసీవ్ చేసుకున్న వెంటనే లోకేషన్ రిజిస్టర్ అవుతుంది. తర్వాత ఆరీస్సీ సిబ్బంది బాధితుల వివరాలను నమోదు చేసుకున్న క్షణాల్లో లోకేషన్‌తో సహా ఈ డేటా మొత్తం ఎండీటీ ద్వారా 108 అంబులెన్స్‌కు చేరుతుంది. అంబులెన్సులోని సిబ్బంది వాహనానికి దూరంగా ఉన్నా, నిర్లక్ష్యంగా ఉన్నా, నిద్రావస్థలో ఉన్నా.... ఈఆర్సీ పెద్దగా సైరన్ చేసి పైలట్ (డ్రైవర్), ఈఎంటీని అలర్ట్ చేస్తుంది. ఎండీటీ డేటా ఆధారంగా వారు లోకేషన్‌కు చేరుకుంటారు. బాధితులను ఎక్కించుకుని బయల్దేరాక మార్గ మధ్యలోనే ప్రాథమిక చికిత్స అందిస్తారు.

మూడేళ్లకే మూలకు చేర్చారు..

అరబిందో సంస్థ 2020 జూన్‌లో 108 వాహనాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించింది. ఈ సంస్థ కోసం గత వైసీపీ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసింది. సాధారణంగా 108 అంబులెన్సులు నిర్వహించే సంస్థ కొత్త వాహనాలు కొనుగోలు చేసుకోవాలి. కానీ వైసీపీ ప్రభుత్వం రూ.104 కోట్లు ఖర్చు పెట్టి మూడేళ్లలో 581 కొత్త వాహనాలను అరబిందోకు అందించింది. ఒకవైపు ఆ సంస్థ కొత్త వాహనాలను కొనుగోలు చేయకపోగా ప్రభుత్వం ఇచ్చిన వాహనాలను మూడేళ్లల్లో తుక్కు తుక్కు చేసింది. కనీసం ఇంజన్ ఆయిల్ కూడా మార్చకుండా వాడడంతో మూడేళ్లకే మూలనపడ్డాయి. కూటమి ప్రభుత్వం అరబిందో నుంచి కొత్త నిర్వహణ సంస్థ 768 వాహనాలను తీసుకుంది. అందులో 300 వాహనాలు పనికి రాకుండాపోయాయి. వైసీపీ ప్రభుత్వం అందించిన కొత్త వాహనాలను కూడా షెడ్‌కు చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాటి రిపేర్లకే కూటమి ప్రభుత్వం దాదాపు రూ.15 కోట్ల వరకూ ఖర్చు చేయాల్సి వచ్చింది. 227 అంబులెన్సులను పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. వీటి విలువ రూ.20 కోట్ల వరకూ ఉంటుంది.

# సినిమా



## నా కిడ్నీ మార్పిడికి చిరంజీవి 70 లక్షలు ఖర్చు చేశాడు.

సినీ పరిశ్రమలో విలన్ గా పేరుగాంచిన నటుడు పొన్నంబళం. ఒకప్పుడు తెలుగు, తమిళం భాషలలో ఎన్నో చిత్రాల్లో విలన్ పాత్రలతో పాపులర్ అయ్యాడు. అయితే కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటున్నాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అతడు.. తన ఆరోగ్యం విషయంలో చిరంజీవి చేసిన సాయాన్ని గుర్తుచేసుకున్నారు. కిడ్నీలు పూర్తిగా పాడై, తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ, జీవనంపై ఆశలు కోల్పోయి, మరణించాలని కోరుకున్న సమయంలో చిరంజీవిని సంప్రదించినట్లు ఆయన తెలిపారు. ఆ కష్టకాలంలో పొన్నంబళం చిరంజీవికి ఫోన్ చేశానని.. అప్పుడు చిరంజీవి అప్పుడు నేపాల్‌లో షూటింగ్‌లో ఉన్నారని అన్నారు. పొన్నంబళం తన పరిస్థితిని వివరించగానే, చిరంజీవి నిమిషాల వ్యవధిలోనే స్పందించారని చెప్పుకొచ్చింది. "ఏం బాధపడొద్దు, నేనున్నాను" అని భరోసా ఇచ్చి, వెంటనే అపోలో ఆసుపత్రి నుంచి ఫోన్ వస్తుందని తెలిపారు. అన్నట్లుగానే, పది నిమిషాల్లోపు అపోలో ఆసుపత్రి నుంచి ఫోన్ వచ్చింది. పొన్నంబళం వెంటనే ఆసుపత్రికి వెళ్లగా, అప్పటికే డాక్టర్ సుబ్బారావు ఆయన కోసం సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు.పొన్నంబళం మొదట డయాలసిస్ కోసం ఆసుపత్రికి వెళ్తున్నానని భావించానని.. అయితే, డాక్టర్ సుబ్బారావు డోనర్ గురించి అడగగా, చిరంజీవి కిడ్నీ మార్పిడికి ఏర్పాట్లు చేశారని తెలుసుకుని ఆశ్చర్యపోయానని అన్నారు. తన మేనల్లుడు కిడ్నీ దాతగా మారడంతో, వారిద్దరికీ ఒకేసారి చికిత్సను ప్రారంభించారు. చికిత్సకు ముందు రోజు రూ. 80,000 ఖర్చుతో పూర్తి స్థాయి శరీర పరీక్షలు జరిగాయి. చిరంజీవి ఆ ఖర్చులు గురించి ఏమీ ఆలోచించకుండా, "నువ్వు నా తమ్ముడివి, చికిత్స చేసుకో" అని ప్రోత్సహించారని చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 10న ఇద్దరికీ శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఈ మొత్తం ప్రక్రియకు రూ. 70 లక్షలు ఖర్చయినట్లు పొన్నంబళం వెల్లడించారు. చిరంజీవి అందించిన ఈ సహాయం తన జీవితంలో మర్చిపోలేనిదని, ఇప్పుడు తాను ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు.తన కష్టకాలంలో తనకు అర్జున్, కే.ఎస్. కుమార్, శరత్‌కుమార్ వంటి ఇతర కళాకారులు కూడా సహాయం చేశారని పొన్నంబళం గుర్తు చేసుకున్నారు. శరత్‌కుమార్‌కు కూడా ఒకప్పుడు చిరంజీవి సహాయం చేశారని, దానిని శరత్‌కుమార్ గుర్తుంచుకుని తనకు సహాయం చేశారని ఆయన పేర్కొన్నారు. కిడ్నీ సమస్యల కారణంగా తాను 126 కిలోల నుంచి 82 కిలోలకు తగ్గిపోయి, దాదాపు 44 కిలోల బరువు కోల్పోయానని చెప్పారు. ఆ సమయంలో తీవ్ర నిరాశతో పోరూర్ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి, తన ప్రాణాలు తీసుకోవాలని అనుకున్నానని, కానీ చిరంజీవి పేరు గుర్తురావడంతో ఆయనకు ఫోన్ చేశానని తెలిపారు.





## బీట్‌రూట్‌తో సూపర్ టేస్టీ జ్యూస్‌లు..

బీట్‌రూట్... ఇది కేవలం కూరగాయ మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఉపయోగపడే సహజ ఔషధం అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. బీట్‌రూట్ పుష్కలమైన పోషకాలను కలిగి ఉంటుంది. క్రమం తప్పకుండా వీటిని మీ ఆహారంలో భాగంగా తీసుకుంటే..రక్తపోటు నుంచి గుండె ఆరోగ్యం వరకు అనేక సమస్యలకు సహజ పరిష్కారంగా పనిచేస్తాయి. అధిక రక్తపోటుతో బాధపడేవారికి బీట్‌రూట్ తినడం చాలా మంచిది. ఇందులో ఉన్న కార్బోహైడ్రేట్లు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ బీట్‌రూట్ తింటే శక్తి స్థాయిలు పెరుగుతాయి. బీట్‌రూట్‌ను వివిధ రూపాల్లో తీసుకోవచ్చు. కావాలంటే సలాడ్లు, జ్యూస్‌ల రూపంలో కూడా వీటిని సులభంగా తీసుకోవచ్చు. బీట్‌రూట్‌తో తయారు చేసే టేస్టీ జ్యూస్‌లు ఇక్కడ చూద్దాం..

కేవలం బీట్‌రూట్ ముక్కలను గ్రైండ్ చేసి బీట్‌రూట్ జ్యూస్ తయారు చేస్తారు. బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల బాడీకి కావాల్సిన శక్తి లభిస్తుంది. బీట్‌రూట్, క్యారెట్ రెండు కలిపి జ్యూస్ తయారు చేయవచ్చు. ఈ జ్యూస్ తాగడానికి రుచికరంగా ఉంటుంది. క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తాగితే రక్తహీనత తగ్గుతుంది.

బీట్‌రూట్, అల్లం: బీట్‌రూట్‌లో అల్లం కలిపి జ్యూస్ తయారు చేసుకుని తాగొచ్చు. బీట్‌రూట్, అల్లం జ్యూస్ తాగితే జీర్ణ సమస్యలు తగ్గుతాయి.బీట్‌రూట్, యాపిల్ జ్యూస్: బీట్‌రూట్ ముక్కలు, యాపిల్ ముక్కలు కలిపి టేస్టీ జ్యూస్ తయారు చేసుకోవచ్చు. ఇది ఓవరాల్ హెల్త్‌ను కాపాడుతుంది.

బీట్‌రూట్, పుదీనా: బీట్‌రూట్ ముక్కల్లో పుదీనా ఆకులు కలిపి జ్యూస్ తయారు చేసుకోవాలి. ఈ జ్యూస్ టేస్టీగా ఉంటుంది.

బీట్‌రూట్, నిమ్మరసం:బీట్‌రూట్ జ్యూస్‌లో నిమ్మరసాన్ని కలిపితే టేస్ట్ బాగుంటుంది. వీటిలోని పోషకాలు ఇమ్యూనిటీ పెంచుతాయి.

బీట్‌రూట్, దానిమ్మ: బీట్‌రూట్ ముక్కలు, దానిమ్మ గింజలు కలిపి మిక్సీ పట్టాలి. ఈ జ్యూస్ టేస్టీగా ఉంటుంది. బీట్‌రూట్, దానిమ్మ జ్యూస్ తాగడం వల్ల హీమోగ్లోబిన్ లెవెల్స్ పెరుగుతాయి.

బీట్‌రూట్, టమాటా: బీట్‌రూట్ ముక్కల్లో టమాటా ముక్కలు కలిపి జ్యూస్ చేసుకుని తాగొచ్చు. ఇది టేస్టీగా ఉంటుంది.

ఖాళీ కడుపుతో: బీట్‌రూట్ జ్యూస్‌ను తాగేటప్పుడు ఖాళీ కడుపుతో తాగితే మంచిది. పోషకాలు బాగా అందుతాయి. హెల్తీగా ఉండొచ్చు.



## ఖర్చు తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ.

బార్లీలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. బార్లీ నీటిని తప్పనిసరిగా తాగాలని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటారు. బార్లీలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి.. మాంగనీస్, సెలీనియం, ఫాస్పరస్, రాగి, యాంటీఆక్సిడెంట్లకు బార్లీ ప్రసిద్ధి.. బార్లీ నీరు.. ఎన్నో అనారోగ్య సమస్యలకు సహజమైన పానీయం.. దీనిద్వారా.. రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు.. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. జీర్ణక్రియను మెరుగుపరిచి.. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.. గుండె ఆరోగ్యానికి, హైడ్రేట్ గా ఇది అత్యంత ఉత్తమమైన ఆహారమని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

అందుకే.. బార్లీ, ఒక సురక్షితమైన, బహుముఖ ధాన్యం.. ఇది అనేక ఆరోగ్య సందేహాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొంటున్నారు. ఇది కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, పలు కీలకమైన వైద్యపరమైన ప్రయోజనాలకు కూడా తోడ్పడుతుంది.

బార్లీ వాటర్ ప్రయోజనాలు..

బరువు తగ్గడం – డిటాక్సిఫికేషన్: బార్లీ ప్రాథమిక ప్రయోజనాలలో ఒకటి దాని డిటాక్సిఫికేషన్ సామర్థ్యం. బార్లీలోని సమృద్ధిగా ఉండే కరిగే, కరగని పీచు పదార్థం (ఫైబర్) శరీరంలోని వ్యర్థ పదార్థాలను సమర్థవంతంగా బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రక్రియ బరువు తగ్గడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ – గట్ ఆరోగ్యం: బార్లీలోని అధిక ఫైబర్ కంటెంట్ గట్ ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, పేగు కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన పరిష్కారం. బార్లీ ఉప్మా, బార్లీ జావ, బార్లీ కిచిడీ లేదా బార్లీ సంకటి రూపాల్లో దీనిని తీసుకోవచ్చు. అయితే, వడియాలు వంటి ప్రాసెస్ చేయబడిన బార్లీ స్నాక్‌లను నివారించి, బార్లీ ధాన్యాలను మొలకెత్తించి (స్ప్రౌటెనింగ్) తీసుకోవడం మరింత ఆరోగ్యకరమైన ఎంపిక. మధుమేహం నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారికి బార్లీ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దానిలోని అధిక పీచు పదార్థం, బీటా-గ్లూకాన్‌లు రక్తంలో ఇన్సులిన్ స్పైక్‌లను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి మధుమేహ రోగుల ఆహారంలో బార్లీని ఒక ముఖ్యమైన ధాన్యంగా చేర్చుకోవచ్చు. దీనిలోని ఫైటోకెమికల్స్ కూడా షుగర్ నియంత్రణకు తోడ్పడతాయి. కిడ్నీ – గాల్ బ్లాడర్ స్టోన్స్ నివారణ: బార్లీ కిడ్నీ రాళ్లను నివారించడంలో, వాటిని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం, బార్లీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కిడ్నీ రాళ్ల పరిమాణం తగ్గి, చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి, మూత్రం ద్వారా సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుందని పేర్కొంటున్నారు. ఇదే విధంగా, బార్లీ గాల్ బ్లాడర్ స్టోన్స్ ఏర్పడటాన్ని నిరోధించడంలో కూడా ఉపయోగపడుతుంది. వేగంగా బరువు తగ్గే (రాపిడ్ వెయిట్ లాస్) సందర్భాలలో గాల్ బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

## సిస్టమ్ మార్చండి.. బోర్డుపై అఫ్రిది ఫైర్

టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు ప్రస్థానం అత్యంత దారుణంగా ముగిసింది. కనీసం సెమీఫైనల్ చేరుతుందనుకున్న ఆ జట్టు సూపర్ 8 దశలోనే ఇంటిముఖం పట్టడంతో ఆ దేశంలో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వైఫల్యానికి బాధ్యులను చేస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన చర్యలకు దిగినట్లు సమాచారం. జట్టులోని ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. బోర్డు నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ వార్త పాక్ క్రికెట్ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతోంది.

ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయమేనని తెలుస్తోంది. గ్రూప్ దశలో అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా వంటి చిన్న జట్లపై గెలిచినప్పటికీ, టీమిండియా చేతిలో ఓడిపోవడం పాక్ బోర్డుకు మింగుడుపడలేదు. ఇక సూపర్ 8లో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడం, ఇంగ్లాండ్‌తో ఓటమి, శ్రీలంకపై నామమాత్రపు విజయం సాధించడంతో పాకిస్థాన్ సెమీస్ రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సల్మాన్ అలీ ఆగా సారథ్యంలో బరిలోకి దిగిన పాక్ జట్టు ఏ దశలోనూ పటిష్టమైన జట్టుగా కనిపించకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

పీసీబీ తీసుకున్న జరిమానా నిర్ణయంపై పాక్ మాజీ దిగ్గజం షాహిద్ అఫ్రిది నిప్పులు చెరిగారు. జరిమానాలు వేయడం వల్ల ఆట మెరుగుపడదని, ఇది చాలా సంకుచితమైన ఆలోచన అని ఆయన మండిపడ్డారు. కేవలం డబ్బులు వసూలు చేస్తే సరిపోదని, అసలు సమస్య క్రికెట్ వ్యవస్థలో ఉందని అఫ్రిది విమర్శించారు. వరుసగా విఫలమవుతున్న ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించి, వారిని మళ్ళీ డొమెస్టిక్ క్రికెట్ ఆడి ఫామ్ నిరూపించుకోమని చెప్పాలని ఆయన సూచించారు. జట్టులో కొత్త రక్తాన్ని నింపాల్సిన సమయం వచ్చిందని, జరిమానాలు వేయడం వల్ల ఆటగాళ్లలో భయం పెరుగుతుందే తప్ప టాలెంట్ బయటకు రాదని అఫ్రిది ఘాటుగా స్పందించారు.

సోషల్ మీడియాలో కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం అఫ్రిది మాటల్లో నిజముందని అభిప్రాయపడుతున్నారు. ఆటగాళ్ల జీతాల నుంచి కోత విధించడం కంటే, మేనేజ్మెంట్ లో మార్పులు చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి టీ20 వరల్డ్ కప్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. మరి రాబోయే రోజుల్లో బోర్డు ఎలాంటి ప్రక్షాళన చేపడుతుందో చూడాలి.



## 'టీమిండియాపైనే ఓడిపోతారా..

టీ20 ప్రపంచకప్ 2026 టోర్నమెంట్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు నిరాశాజనకమైన ప్రదర్శనతో ఇంటిదారి పట్టింది. సూపర్ 8 దశ వరకు చేరుకున్నప్పటికీ, కీలక మ్యాచ్‌లలో ఓడిపోయి సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ దారుణ వైఫల్యం తర్వాత, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఆటగాళ్లపై కఠినమైన చర్యలకు ఉపక్రమించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, పీసీబీ గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడిపోయినందుకు గానూ, ప్రతి ఆటగాడికి 50 లక్షల పాకిస్తాన్ రూపాయల(భారత కరెన్సీలో సుమారు 16 లక్షలు) భారీ జరిమానా విధించింది. ఈ జరిమానాను చెల్లించడంలో విఫలమైతే జట్టు నుంచి తొలగిస్తామని కూడా పీసీబీ హెచ్చరించినట్లు తెలుస్తోంది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి.

పీసీబీ నిర్ణయంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు తీవ్రంగా స్పందించారు. మొహ్సిన్ నఖ్వీ తీరును ప్రశ్నిస్తూ, "ఆటగాళ్లు 50 లక్షలు కట్టడం ఎక్కడైనా ఉందా? పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ బుర్ర పనిచేస్తోందా.?" అని మండిపడ్డారు. కొత్త నిబంధనలు తీసుకువచ్చి పాకిస్తాన్ క్రికెట్ వ్యవస్థను నాశనం చేస్తున్నాడని ఆరోపించారు. 50 లక్షల రూపాయల కోసం ఆటగాళ్లు ఎక్కడికి వెళ్ళాలని, డబ్బులు చెట్లకు కాస్తున్నాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిగ్గా ఆడకపోతే ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి గానీ, డబ్బులు వసూలు చేయడం సరికాదని మాజీలు విమర్శించారు.

ఆటగాళ్ల ప్రదర్శన సరిగ్గా లేకపోతే ఒక్కొక్కరిపై రెండు సంవత్సరాల పాటు వేటు వేయాలని సూచించారు. అలాంటి కఠిన చర్యల ద్వారా మాత్రమే పాకిస్తాన్ ఆటగాళు సరైన దారిలోకి వస్తారని పేర్కొన్నారు. పాకిస్తాన్ జట్టులో ఈ విధమైన సంక్షోభం నెలకొన్న వేళ, టీమిండియా టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనను కనబరుస్తోంది. సూపర్ 8లోని తమ చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై విజయం సాధించి సెమీ-ఫైనల్స్‌లోకి ఘనంగా అడుగుపెట్టింది. అంతేకాకుండా, మూడో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com